పుట్టినరోజు శుభాకాంక్షలు

బీఆర్ఎస్ నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. హరీశ్‌రావు తన నివాసంలో ఎర్రోళ్లకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కొండాపూర్, మే 5: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతిని అమల్లోకి తీసుకువచ్చిందని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాల్లో భూ భారతి కార్యక్రమాన్ని టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి ప్రారంభించారు. కొండాపూర్ మండల తహసీల్దార్ అశోక్ ఆధ్వర్యంలో భూ సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ భూ భారతి చట్టంపై రైతులకు ఇటీవల సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందుకెళ్లుతుందన్నారు. గ్రామాల్లోనే రెవెన్యూ విభాగంలో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. రైతులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశ ఆర్థిక ప్రగతిలో రైతుల భాగస్వామ్యం మరువలేనిదన్నారు. అలాంటి రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. అనంతరం నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఈ చట్టాన్ని తీసుకురావడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ మర్రి ప్రదీప్, ఆర్ఐ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సడాకుల కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మాజీ ఎంపీపీ మనోజ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీకాంత్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, నాయకులు గౌరిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేంకటేశం గౌడ్, ప్రభుదాస్, నర్సింహులు, ప్రశాంత్ గౌడ్, మండల యువత అధ్యక్షుడు అశోక్, మల్లారెడ్డి, మండల వ్యవసాయాధికారి గణేశ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన

అమీన్‌పూర్, మే 5: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వాణీనగర్, లాలాబావి, పెద్ద చెరువు మీదుగా బంధంకొమ్ము వరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనులను త్వరగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రూ.23 కోట్లతో రహదారి విస్తరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. బంధంకొమ్ము పరిధిలో విద్యుత్ స్తంభాల తరలింపు, నూతన లైన్ల ఏర్పాటు కోసం గతంలో రూ.4 కోట్ల 70 లక్షలు కేటాయించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, తహసీల్దార్ వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, విద్యుత్ శాఖ డీఈ భాస్కర్‌రావు, మున్సిపల్ ఇంజినీరింగ్ డీఈ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

ఎల్లమ్మగూడలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

హత్నూర, మే 5: హత్నూర మండలం ఎల్లమ్మగూడ శివారులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఫర్హీన్ షేక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం దేవేందర్ పాల్గొన్నారు.

పట్టణవాసుల దాహార్తి తీర్చండి

- మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించిన ఎమ్మెల్యే ప్రభాకర్

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి, మే 5: సంగారెడ్డి గ్రేడ్-1 మున్సిపాలిటీలో ప్రజల దాహార్తి తీర్చాలని, నిరంతరం తాగునీరు సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ ఇంజినీర్‌తో కలిసి ఎమ్మెల్యే తాగునీటి సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాలో నెలకొన్న ఇబ్బందులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి, ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, రానున్న వర్షాకాలం దృష్ట్యా పూడికలు తీసి, రహదారులపై వర్షపు నీరు నిల్వకుండా, పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పట్టణాల్లో వెలగని వీధిదీపాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకొని మరమ్మతులు చేయించాలన్నారు. డంపింగ్ యార్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, డీఈఈ ఇంతియాజ్ అహ్మద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు జీవీ శ్రీనివాస్, దిడ్డి విఠల్, శ్రావణ్‌రెడ్డి ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

మనూరు, మే 5: సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. మనూరు మండలపరిధిలోని తిమ్మాపూర్ తండాలో సోమవారం భవానీమాత, సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి తండాపెద్దలు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మనూరు మండల అధ్యక్షుడు విఠల్‌రావు, నాయకులు రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా

లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్, మే 5: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండలంలోని బూర్దిపాడ్ గ్రామానికి చెందిన గుమ్మల బాల్‌రాజ్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెంటారెడ్డి, అబ్రహం, దత్తురెడ్డి, పీజీ శంకర్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సదాశివపేట, మే 5: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సోమవారం ప్రారంభించారు. రైఫిల్ షూటింగ్, కిక్ బాక్సింగ్, షటిల్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ తదితర క్రీడల సమ్మర్ క్యాంపు పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ఉచిత వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఉచిత వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు కోచ్‌లను అభినందించారు. విద్యార్థుల కోసం హాస్టల్స్‌ను నిర్మించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బంగ్లా భారతి కోరగా, ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి హాస్టల్స్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్‌పాటిల్, సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, అవినాశ్, సాయి, సత్యనారాయణ, షఫీ, మహమూద్, కోటి, ఆరీఫ్, లావణ్య పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల బస్సు ప్రారంభం

నర్సింగ్ కళాశాల బస్సును కలెక్టర్ వల్లూరు క్రాంతి, వైద్య విద్యార్థినులతో కలిసి ప్రారంభిస్తున్న మంత్రి రాజనర్సింహ

సంగారెడ్డి కలెక్టరేట్, మే 5: సీఎస్ఆర్ నిధులతో జోగిపేట నర్సింగ్ కళాశాలకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతి బస్సును అందజేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్, నర్సింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి మంత్రి జెండాఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని తోషిబా పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో నూతన బస్సును మెడికల్ కళాశాలకు కేటాయించామన్నారు.. నర్సింగ్ కళాశాల విద్యార్థులు ఈ బస్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలికలు విద్యావంతులైతే సమాజంలో మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తోషిబా కంపెనీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జహీరాబాద్, మే 5: పరిశ్రమల కోసం మాయమాటలు చెప్పి రైతుల నుంచి భూములు సేకరించి, వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామచందర్ అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుచినెల్లి గ్రామానికి చెందిన బాధిత రైతులు ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ముంబై-హైదరాబాద్ 65వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న బుచినెల్లి శివారులో పరిశ్రమ కోసం అంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు అప్పటి ఏపీఐఐసీ అధికారులు రైతుల నుంచి భూములు సేకరించారన్నారు. ఎకరానికి రూ.15 లక్షలు, 120 గజాల ఇంటి స్థలం, బాధిత రైతు కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, కాలుష్యం లేని పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తేనే భూములు ఇస్తామని రైతులు తెలిపారు. కానీ ఎకరానికి రూ.3.50 లక్షలు చెల్లించి అధికారులు చేతులు దులుపుకున్నారు. భూములు ఇచ్చిన రైతులకు ఎకరానికి రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారి వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు.

ఒకరికి జైలుశిక్ష

గుమ్మడిదల, మే 5: మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఎస్సై మహేశ్వర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఇటీవల గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని గుర్తించారు. ఇందులో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరికి సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ.2200 జరిమానా విధించారని ఎస్సై తెలిపారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

హత్నూర పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్

హత్నూర, మే 5: గ్రామాల్లో నిత్యం పర్యటిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ పరితోష్ పంకజ్ అధికారులకు సూచించారు. సోమవారం హత్నూర పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. ప్రజలతో మమేకంగా ఉంటూ వారికి ఎలాంటి ఆపద వచ్చినా పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఎస్పీ పోలీసులకు సూచించారు. సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారితో ఆప్యాయంగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ సుభాష్, సిబ్బంది ఉన్నారు.

గుమ్మడిదల ఠాణా తనిఖీ

గుమ్మడిదల, మే 5: గుమ్మడిదల ఠాణాను ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిన్నారం సీఐ నయిమొద్దీన్, ప్రొహిబిషన్ ఎస్సై చైతన్యకుమార్ తోపాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కలెక్టరేట్ ప్రజావాణికి 55 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, మే 5: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతివారం నిర్వహించే ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 55 అర్జీలు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేసి వాటిని సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఆయా అర్జీలను స్వీకరించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై దృష్టి సారించి సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంట మార్పిడితోనే అధిక ఆదాయం

- రైతులకు అవగాహన కల్పించిన శాస్త్రవేత్తలు, అధికారులు

రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌కుమార్

జహీరాబాద్, మే 5: పంట మార్పిడితోనే వ్యవసాయంలో అధిక ఆదాయం పొందవచ్చునని న్యాల్‌కల్ మండలం బసంతపూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మామిడ్గిలో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పంట మార్పిడితో అనేక ఆదాయంతో పాటు చీడపురుగుల నివారణ సులువుగా ఉంటుందన్నారు. మేలో పొలాలు దున్ని, చెరువు మట్టి తరలిస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. పచ్చిరొట్ల ఎరువులు, జీలుగ ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించి సన్న, చిన్నకారు రైతులు ఆదాయం పొందేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కంది వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.చరిత్‌కుమార్ మాట్లాడుతూ నీరు వృథాగా పోకుండా మొక్కకు కావాల్సిన నీటిని బొట్టుగా వేరు దగ్గర డ్రిప్, స్ప్రింక్లర్ ద్వారా అందించాల న్నారు. వ్యవసాయాధికారి అవినాశ్ వర్మ మాట్లాడుతూ రైతులు విత్తనాలకు సంబంధించి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, తద్వారా ఏదైనా నష్టం వాటిల్లితే పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డా.పద్మ, అనీల్‌కుమార్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి మోసపోవద్దు

సిర్గాపూర్, మే 5: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ప్రజలు మోసపోవద్దని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఠాణాలో మాట్లాడుతూ వాట్సాప్, టెలిగ్రాం గ్రూపుల్లో కార్డులు, డిస్కౌంట్ల కోసం ఇచ్చే క్యూఆర్ కోడ్ ఆన్ చేయరాదన్నారు. ఒకవేళ ఆన్ చేస్తే మాత్రం మీ ఫోన్ హ్యాక్ అవ్వొచ్చన్నారు. మీ వ్యక్తిగత సమాచారం చోరీకి గురయ్యే అవకాశముందన్నారు. అందుకే ఎవరూ అత్యాశకు వెళ్లి మోసపోరాదని ఎస్ఐ ప్రజలకు సూచించారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

విఠల్‌ను పరామర్శిస్తున్న నరోత్తం

జహీరాబాద్, మే 5: న్యాల్‌కల్ మండలం హుస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు విఠల్ భార్య సిద్దమ్మ ఆదివారం కరెంట్ షాక్‌తో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు విఠల్‌ను సోమవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు హనీఫ్, చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మల్లికార్జున్, ఉమేశ్ పాటిల్, నాగన్న ఉన్నారు.

90వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, మే 5: ప్యారానగర్ డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటితో 90వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను ఉపసంహరించుకొని, ఇక్కడి గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం డంపింగ్ యార్డుపై స్పందించడం లేదన్నారు. డంపింగ్ యార్డు వల్ల పర్యావరణం, భూగర్భ జలాలు కలుషితం అవ్వడమే కాకుండా, ఇక్కడి భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోతాయన్నారు. డం పింగ్ యార్డు వల్ల వచ్చే దుర్గంధం వల్ల రోగాలబారిన పడుతామన్నారు. ప్రజలకు నష్టం జరిగే డంపింగ్ యార్డును ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. దీక్షలో రైతు జేఏసీ నాయకులతోపాటు రత్నం, జీలభాగ్యమ్మ, శాం తమ్మ, గంగమ్మ, గౌరమ్మ, వీరయ్య, శంకరయ్య, రైతు జేఏసీ అధ్యక్షుడు కుమ్మరి ఆంజనేయులు, మొన్న మల్లేశం, పట్నం పోచయ్య పాల్గొన్నారు.

పత్తి యాజమాన్య పద్ధతులపై అవగాహన

రాయికోడ్, మే 5: రైతులు పత్తి యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని రాయికోడ్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. సోమవారం రైతు వేదికలో మండలంలోని రైతులకు పత్తి పంటపై అవగాహన కల్పించాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాదారులు ఎరువులు, విత్తనాలు విక్రయించేందుకు లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలన్నారు. రైతులకు తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఆత్మకమిటీ చైర్మన్ కచూర్‌రావు, ఏవో సారికారెడ్డి, ఏఈవోలు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

పుల్కల్, మే 5: తెలంగాణ మోడల్ స్కూల్ బస్వాపూర్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కల్యాణ చక్రవర్తి ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను మే 26వ తేదీన కళాశాల నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తామన్నారు. 27వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ప్రవేశ ప్రక్రియ పూర్తవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. సీట్ల కేటాయింపు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరిట్, రిజర్వేషన్ల ఆధారంగా ఉంటుందన్నారు.

జిన్నారంలో..

జిన్నారం, మే 5: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు 40 అడ్మిషన్ల చొప్పున మొత్తం160 సీట్లు ఉన్నాయన్నారు. మే 5 నుంచి ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థుల జాబితా ఈనెల 26వ తేదీన నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామన్నారు. సర్టిఫికెట్ల ధ్రువీకరణ ప్రవేశ ప్రక్రియ మే 27 నుంచి 31 వరకు పూర్తవుతుందని, సీట్ల కేటాయింపు టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మెరిట్, రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ఉంటుందన్నారు.

విద్యార్థులకు సన్మానం

విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ మచ్చా నరేందర్

హత్నూర, మే 5: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చి అత్యధిక మార్కులు సాధించిన సిరిపుర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సోమవారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పదో తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులతో పాటు వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను పూలమాల, శాలువాతో సన్మానించారు. మాజీ సర్పంచ్ మచ్చా నరేందర్, గ్రామ కార్యదర్శి సుదర్శన్, పాండరీ, బీఎస్ గౌడ్ పాల్గొన్నారు.

డిజైర్ సొసైటీలో ముగిసిన సమ్మర్ క్యాంపు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ కృష్ణారెడ్డి, రాంబాబు

జిన్నారం, మే 5: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని డిజైర్ సొసైటీలో రెండురోజులుగా కొనసాగుతున్న 15వ సమ్మర్ క్యాంపు సోమవారం అట్టహాసంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎస్ఐ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2005లో స్థాపించబడిన డిజైర్ సొసైటీ ద్వారా ఎయిడ్స్ బాధిత చిన్నారులకు అండగా నిలిచిన సభ్యులను అభినందించారు. వసతి, భోజనం, విద్య, ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడం గొప్ప విషయన్నారు. ప్రతిఏటా విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు కూడా ఏర్పాటు చేసి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని నింపుతున్నారని కొనియాడారు. ఆటపాటల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎస్ఐ చేతుల మీదుగా నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. జేపీఎంసీ టీం సభ్యులు విద్యార్థులకు భోజన వసతి కల్పించి, న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. సొసైటీ ఫౌండర్ రవిబాబు విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పలు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, నిర్వాహకులు, సొసైటీ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

హత్నూర: పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

హత్నూర, మే 5: హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం అందరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ తమతమ జీవన స్థితిగతులపై చర్చించుకున్నారు.

జహీరాబాద్ శిశుమందిర్‌లో...

జహీరాబాద్, మే 5: జహీరాబాద్‌లోని సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. పాఠశాలలో 2001 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఉత్సాహంతో కలుసుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు రూ.4 లక్షలతో విద్యార్థుల సౌకర్యార్థం రెండు తరగతి గదులను ఆధునీకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జహీరాబాద్: శిశుమందిరంలో..

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఆస్క్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు అమృతసత్తయ్య

రామచంద్రాపురం, మే 5: తెల్లాపూర్‌లోని ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహం ప్రాంగణంలో ఆస్క్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ఆస్క్ సొసైటీ వ్యవస్థాపకులు కొల్లూరి అమృతసత్తయ్యతో కలిసి ఇంటర్నేషన్ బీచ్ వాలీబాల్ క్రీడాకారుడు కృష్ణంరాజు, ఏసీపీ గంగాధర్ ప్రారంభించారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అన్ని దానాలకంటే విద్యాదానం గొప్పదని, చదువుతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కొల్లూరి సత్తయ్య కార్మిక నాయకుడిగా కార్మికుల కష్టాలు తీర్చడంతోపాటు పేదల కష్టాలు తీర్చేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం ఆదర్శనీయమన్నారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడంతో పాటు క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, ఆస్క్ సొసైటీ కార్యదర్శి భరత్, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, ఉపసర్పంచ్ కృష్ణ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నగేశ్, లచ్చిరామ్‌నాయక్, ప్రభాకర్‌రెడ్డి, సాగర్, రవీందర్, నర్సింలు, శ్రీను, రవి, వివేశ్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ గుర్తింపు కార్డు

రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఈవో ప్రశాంత్

పుల్కల్, మే 5: ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికీ గుర్తింపు కార్డు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకూ 14 నెంబర్లతో కూడిన విశిష్ట సంఖ్య (యూనిక్ కోడ్) కేటాయించాలని కేంద్రం నిర్ణయించినట్లు ఏఈవో ప్రశాంత్ తెలిపారు. సోమవారం రైతువేదికలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. ఏఈవో మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టిందన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు తనకు ఉన్న భూముల వివరాలతో కూడిన సమాచారంతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేసి ఫార్మర్ ఐడీని కేటాయిస్తారని చెప్పారు.

గుండెపోటుతో హిందీ పండిట్ మృతి

సిర్గాపూర్, మే 5: మండలంలోని వాసర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌రామ్ గుండెపోటుతో మృతిచెందారు. ఆదివారం నారాయణఖేడ్ నుంచి కుటుంబసభ్యులతో కలిసి తుల్జాపూర్ భవానీమాత దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో హఠాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలాడు. హుటాహుటినా దవాఖానకు తరలించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయన మృతికి ఎంఈవో నాగారం శ్రీనివాస్, వాసర్ జీహెచ్ఎం మంజులాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.